క్లుప్తంగా

ఘనంగా భగవాన్ బాబా జయంతి

జైనూర్: లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన మహానుభావుడు సంత్ శ్రీ భగవాన్ బాబా అని హెచ్ఆర్సీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముండే సతీశ్, యువజన సంఘం అధ్యక్షుడు కేంద్రే పర్శరాం అన్నారు. సోమవారం మండలంలోని జామిని గ్రామంలో భగవాన్ బాబా 127వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చోలే మాధవ్, అర్జున్, బాలాజీ, సంభాజీ, నాగ్‌నాథ్ ఉన్నారు.

గిరిజన యూనివర్సిటీ మంజూరు చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఎస్ఎఫ్ఐ సంఘం కార్యాలయంలో సంఘ జిల్లా కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.కిరణ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాకు గిరిజన యూనివర్సిటీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ఎస్ఎఫ్ఐ నూతన అధ్యక్షుడిగా ఎస్‌కే జాఫర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

కిశోరామృతం పంపిణీ


కిశోరామృతం పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీలు

దహెగాం: మండలంలోని ఇట్యాల గ్రామంలో గల అంగన్‌వాడీ -1 కేంద్రంలో సోమవారం యుక్తవయస్సు బాలికలకు కిశోరామృతం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మురారి మాట్లాడుతూ బాలికలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త దీకొండ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌కు బయల్దేరిన స్వర్ణకారులు

బెజ్జూర్: కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర స్వర్ణకారుల సంఘం పిలుపుమేరకు మండల స్వర్ణకార సంఘం నాయకులు సోమవారం తరలివెళ్లారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామని వారు తెలియజేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పురుషోత్తమాచారి, స్వర్ణకార సంఘం అధ్యక్షుడు శ్రీనివాసచారి, నాయకులు చాకటి బ్రహ్మయ్య, రమేశ్, సతీశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతి శిక్షణ కేంద్రం పరిశీలన


మాట్లాడుతున్న ఎస్‌వో శ్రీనివాస్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉన్నతి శిక్షణ కేంద్రాన్ని ఎస్‌వో శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మౌలిక సామర్థ్యాల సాధనకు బోధన పీరియడ్, అభ్యాసన పీరియడ్‌లను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

వాంకిడి: మండలంలోని కనర్‌గాం గ్రామ పంచాయతీలో జూనియర్ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న దాసరి శ్రీనివాస్‌రావును సోమవారం ఆర్‌టీఐ జిల్లా అధ్యక్షుడు జాడి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సన్మానించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా రెగ్యులర్ అయినందున సన్మానం చేసినట్లు వారు తెలిపారు. మధుకర్, శ్రీనివాస్, జాడి కిరణ్, మొండయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

యువకుడికి సన్మానం

పెంచికల్‌పేట్: మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన నగునూరి సతీశ్ ఇటీవల విడుదలైన ఫలితాల్లో సహస్ర సీమ బల్ (ఎస్ఎస్‌బీలో కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించగా సోమవారం సర్పంచ్ ఉపాసీ సంజీవ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు అశోక్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవకు ట్రస్ట్ మహిళా సభ్యులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణం నుంచి తిరుమల తిరుపతి దేవస్థానంలో నవనీత సేవ చేసేందుకు కోనేరు ట్రస్ట్ మహిళా సభ్యులు సోమవారం బయల్దేరి వెళ్లారు. భక్తులకు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సతీమణి కోనేరు రమాదేవి కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో పసుపు, కుంకుమలు అందజేశారు.

వారసంతలో అన్నదానం

కౌటాల: మండల కేంద్రంలోని మార్కెట్ ఏరియాలో సోమవారం శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మన్నెవార్ సేవా సంఘం భవనంలో ముందుగా సత్యసాయి బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

‘ఆనకట్ట’ తిప్పలు


ఇసుకతో నిండిన ఆనకట్ట

- నిజాం కాలంలో మత్తడి ఆనకట్ట నిర్మాణం
- పునర్నిర్మాణం తర్వాత మొదలైన కష్టాలు
- వాగులోకి వృథాగా వరద
- మట్టికట్టలతో పొలాలకు మళ్లిస్తున్న రైతులు

బెజ్జూర్: నిజాం కాలంలో మత్తడివాగుపై నిర్మించిన స్ప్రింగ్ ఆనకట్టను ప్రభుత్వం విస్మరించడంతో ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వరద వృథాగా వాగులోకి వెళ్తుండడంతో స్వయంగా రైతులే శ్రమదానం చేసి నీటిని కాలువల వైపు మళ్లించేలా తాత్కాలిక కట్టలు నిర్మిస్తున్నారు. భారీ వర్షం కురిసిన ప్రతీసారి తాత్కాలిక కట్టలు తెగిపోతుండడంతో వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

1903లో నిర్మాణం..

నిజాం సర్కార్ బెజ్జూర్ మండల కేంద్రానికి దాదాపు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న మత్తడివాగుపై స్ప్రింగ్ ఆనకట్ట నిర్మించింది. ప్రారంభంలో దాదాపు 500 ఎకరాలకు సాగు నీరందించడంతోపాటు ఆరు చెరువులకు సైతం ఈ నీటిని వినియోగించేవారు. ప్రస్తుతం 200 ఎకరాలకు కూడా సరిగా నీరందించలేని పరిస్థితి ఉంది. 1903లో స్ప్రింగ్ కట్ట నిర్మించగా భారీ వర్షాలతో 1986లో కుంగిపోయింది. 1992లో అప్పటి ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తంరావు, సీఎం కోట్ల విజయభాస్కర్ హయాంలో రూ.10లక్షల నిధులతో ఆనకట్ట పునఃనిర్మాణం చేపట్టారు. 2007లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మరమ్మతుల కోసం దాదాపు రూ.80లక్షల నిధులు మంజూరు చేయించారు. 2018లో అప్పటి ఎమ్మెల్యే కోనప్ప మరోసారి రూ.60 లక్షలకు పైగా నిధులను మంజూరు చేయించి మరమ్మతులు చేపట్టినా పూర్తిస్థాయిలో పంటపొలాలకు నీరందడం లేదు.

ఒక గేటు వైపునకే నీరు..

నిజాం కాలంలో స్ప్రింగ్ ఆనకట్ట నిర్మాణంలో భాగంగా 20ఫీట్ల లోతులో కట్టకు రెండు గేట్లు ఏర్పాటు చేశారు. వరద ఒక గేటు ద్వారా వాగుకు.. మరో గేటు ద్వారా పంట పొలాలకు వెళ్లేలా చర్యలు చేపట్టారు. ఈ గేట్ల ద్వారా ఇసుక, చెత్త కూడా బయటకు వెళ్లేందుకు అనుకూలంగా ఉండేది. అనంతర కాలంలో మరమ్మతులు చేయించిన అధికారులు నిజాం కాలంలోని గేట్లను మరోచోటుకు మార్చారు. దీంతో ఇసుక దిబ్బలు ఏర్పడి గేట్ల ద్వారా వరద సక్రమంగా వెళ్లలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. వరద మొత్తం వాగులోకే వెళ్తుండడంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు.

భారీ వర్షం పడితే.. అంతే సంగతి

ఇసుక దిబ్బల కారణంగా నీరంతా వాగు గేటు వైపునకు వెళ్తుండడంతో రైతులు తాత్కాలిక మట్టికట్టలు ఏర్పాటు చేసి వరదను పంట పొలాలకు మళ్లిస్తున్నారు. భారీ వర్షం కురిసినప్పుడు తాత్కాలిక కట్టలు కొట్టుకుపోవడంతోపాటు మత్తడి స్ప్రింగ్ ఆనకట్ట పొంగి నీరంతా వృథాగా వాగులోకి వెళ్తోంది. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత రైతులు మళ్లీ తాత్కాలిక మట్టికట్టలు ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఈ వర్షాకాలంలో ఇప్పటివరకు మూడుసార్లు మరమ్మతులు చేపట్టారు. కాలువలు సైతం అధ్వానంగా ఉండడంతో రైతులే మరమ్మతులు చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆనకట్ట పునఃనిర్మించడంతో పాటు కాలువలకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై నీటిపారుదల శాఖ ఈఈ ప్రభాకర్‌ను వివరణ కోరగా.. త్వరలోనే ఆనకట్టను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.


కాలువకు మరమ్మతులు చేస్తున్న రైతులు (ఫైల్)

మరమ్మతులు చేపట్టాలి



ఆనకట్ట కింద మండల కేంద్రంతో పాటు ఎలుకపల్లి, సిద్దాపూర్ తదితర గ్రామాలకు చెందిన రైతుల పొలాలు ఉన్నాయి. ఆనకట్టకు మరమ్మతులు చేయించి పంటలకు నీరందేలా చూడాలి.

– చటారి నారాయణ, రైతు

వర్షం పడితే ఇబ్బంది



వర్షం పడితే కాలువ వైపుగా వచ్చే నీరంతా వృథాగా వాగులోకి వెళ్తుంది. దీంతో రైతులం స్వయంగా నీటిని కాలువలకు మళ్లిస్తున్నాం. ఎంత వాన పడినా రెండు వైపులా వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కుట్రంగి భీంరావు, రైతు

కళాకారులకు ఉపాధి చూపాలి


గొంట్లపేట్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కళాకారులు

పెంచికల్‌పేట్: ప్రభుత్వం దుబ్బుల కొలువు కళాకారులకు ఉపాధి చూపాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జున్గరి దుర్గయ్య డిమాండ్ చేశారు. పెంచికల్‌పేట్ మండలం గొంట్లపేట్ గ్రామంలో సోమవారం దుబ్బు కళాకారుల జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏళ్లుగా దుబ్బు కళాకారులు దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారన్నారు. కళాకారులను ఆదుకోవడానికి ప్రత్యేక నిధులు కేటాయించి, పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు గ్రామంలో డప్పుచప్పులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బామినే రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి మాసూరి దేవేందర్, డివిజన్ అధ్యక్షుడు బామినే నాందేవ్, మండల అధ్యక్షుడు చంద్రయ్య, కళాకారులు పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ఆసిఫాబాద్‌అర్బన్: దేశ వ్యాప్తంగా అధికంగా ఉన్న బీసీలకు బీజేపీ ప్రభుత్వం న్యాయం చేస్తుందని జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజన్ గంగారం అన్నారు. రామగుండం ఎన్టీపీసీలో కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తున్న క్రమంలో జిల్లా కేంద్రంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రె విశాల్, సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పాల్వాయి హరీశ్‌బాబు, నాయకులు, కార్యకర్తలు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. హన్సరాజన్‌కు జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, నాయకులు ఆత్మారాం నాయక్, వెంకటేశం, సత్యనారాయణ, నానయ్య, మల్లయ్య, గణపతి, మోహన్, వెంకన్న, బాలాజీ, మల్లేష్, తుకారాం, నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

‘వేతనాల బడ్జెట్ విడుదల చేయాలి’


వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెంచిన వేతనాల చెల్లింపునకు బడ్జెట్‌ను విడుదల చేయాలని మధ్యాహ్న భోజన కార్మికులు కోరారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కొత్త మెనూకు బడ్జెట్ కేటాయించాలని, కోడిగుడ్డుకు అదనంగా నిధులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, రేణుక తదితరులు ఉన్నారు.

రెబ్బెన: మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాల చెల్లింపులకు బడ్జెట్ విడుదల చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి మాయ అన్నారు. ఈమేరకు సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షురాలు విజయ, మండల కార్యదర్శి పద్మ, పోషమ్మ, కార్మికులు హసీనా, ఈశ్వరీ, రాజేశ్వరి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: తమ సమస్యలు పరిష్కరించాలని సోమవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు తహసీల్దార్ కార్యాలయంలో డీటీ బక్కయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్మికులు గురిజాల లలిత, పార్వతి, లక్ష్మి, పద్మ, మల్లక్క తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీరు.. తాగేదెలా సారూ?



బెజ్జూర్: మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ మంచి నీటిని సరఫరా చేస్తున్నామని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అటువంటి పరిస్థితులు కనిపించడం లేదు. మండలంలోని సోమిని గ్రామంలో మిషన్ భగీరథ నీరు అందక ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో ఉన్న బోర్ నుంచి వచ్చే నీటిని తాగాల్సిన దుస్థితి వారిది. బోర్ నుంచి వచ్చే నీరు పసుపుపచ్చగా ఉండడంతో తాగలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీటితో అనారోగ్యం బారిన పడిన సంఘటనలు సైతం ఉన్నాయని వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని వేడుకుంటున్నారు.

‘భగీరథ’ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి


ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్: మిషన్ భగీరథ పథకంలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వారు చేస్తున్న సమ్మె సోమవారం నాల్గోవ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లోకేష్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల అక్రమ తొలగింపులు, అధికారుల వేధింపులు అరికట్టాలన్నారు. నాయకులు బుద్దయ్య, శ్రీకాంత్, సురేశ్, బాలేశ్, రవీందర్, మధుకర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి యాజమాన్య విధానాలను ఖండించాలి


ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన: కార్మికులను మభ్యపెట్టే విధంగా వ్యవహరిస్తున్న సింగరేణి యాజమాన్య విధానాలను కార్మికులంతా ఖండించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి అన్నారు. సోమవారం గోలేటిలోని జీఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన అనంతరం జీఎం రవిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మొదటి వేజ్‌బోర్డు నుంచి 10వ వేజ్‌బోర్డు వరకు ఏరియర్స్‌ను సింగరేణి కార్మికులకు చెల్లించిన తరువాతే కోల్‌ఇండియాలో కార్మికులకు ఇచ్చేవారన్నారు. 11వ వేజ్‌బోర్డు ఏరియర్స్‌ను కోల్‌ఇండియాలో ఇప్పటికే చెల్లింపులు జరగ్గా సింగరేణిలో మాత్రం ఏరియర్స్ చెల్లించే తేదీలను ప్రకటించలేదన్నారు. కార్మికులకు లాభాల వాటా, ఏరియర్స్ ఒకేసారి చెల్లించాలన్నారు. బ్రాంచి ఆర్గనైజింగ్ కార్యదర్శులు చంద్రశేఖర్, రాజేశ్, కిరణ్‌బాబు, రాజయ్య, దివాకర్, ఫిట్ కార్యదర్శి శ్రీనివాస్, రామయ్య, నాయకులు అంజయ్య, రమేశ్, రాంకిషన్ తదితరులు పాల్గొన్నారు.

‘రేషన్‌కార్డుల జారీలో ప్రభుత్వం విఫలం’


వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: నూతన రేషన్ కార్డులు జారీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, దీంతో పేద ప్రజలు ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తిక్ పేర్కొన్నారు. రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని త్వరగా ప్రారంభించాలని సోమవారం జిల్లా కేంద్రంలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. సమావేశంలో నాయకులు దుర్గం రాజ్‌కుమార్, టీకానంద్, దుర్గం నిఖిల్ పాల్గొన్నారు.

అర్హులకు రేషన్‌కార్డులు మంజూరు చేయాలి

రెబ్బెన: మండలంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్ కార్డులు మంజూరు చేయాలని డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు చాపిడి పురుషోత్తం అన్నారు. ఈ మేరకు సోమవారం ఇన్‌చార్జి తహసీల్దార్ వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి శివ, మండల ఉపాధ్యక్షుడు వంశీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్షణ కోసమే షీ టీంలు


షీటీం సేవలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రెబ్బెన: పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రక్షణ కల్పించే ఉద్దేశంతో షీటీంలు పని చేస్తున్నాయని షీటీం సిబ్బంది సునీత అన్నారు. ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు ఆదేశాల మేరకు మండలంలోని గంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఈవ్‌టీజింగ్‌పై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలు ఎవరైనా హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైం వంటి వాటికి గురైతే వెంటనే షీటీంను సంప్రదించాలన్నారు. అత్యవసర సహాయం కోసం డయల్ 100కి కాల్ చేయాలని సూచించారు. షీటీం, ఆసిఫాబాద్‌ను 8712670564 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు. షీ టీం సభ్యులు స్వప్న, శ్రీలత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలని సమగ్రశిక్ష ఉద్యోగుల వినతి


వినతిపత్రం అందజేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

ఆసిఫాబాద్‌రూరల్: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సోమవారం సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ హేమంత్ బోర్కడే, డీఈవో అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కుటుంబాల పోషణ కష్టంగా ఉందన్నారు. సంఘం కోశాధికారి నగేశ్, నాయకులు సంతోష్, రమేశ్, మోహన్, సందీప్, మహేశ్, సంతోష్, రవి తదితరులు ఉన్నారు.

ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి


సక్కుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం భవనానికి ప్రహరీ నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు సప్త బాలకిషన్ అన్నారు. ఈమేరకు సోమవారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు తన క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. నాయకులు దూడల అశోక్, ఆనంద్‌రావ్, కమలాకర్, రాంచందర్, ధర్మా, రవి, సాలయ్య, తిరుపతి, సత్యనారాయణ, నరేశ్, సంతోష్ ఉన్నారు.

‘నీట్’లో సత్తా చాటిన శైలజ


ధరావత్ శైలజ

బెజ్జూర్: మండలంలోని లంబడిగూడ గ్రామానికి చెందిన ధరావత్ మంజునాయక్ -కవిత దంపతుల కుమార్తె ధరావత్ శైలజ నీట్ ప్రవేశ పరీక్షలో సత్తా చాటింది. ఎస్టీ కేటగిరిలో 1691వ ర్యాంక్ సాధించింది. నిర్మల్ జిల్లా కేంద్రంలోని టీఎస్ ఆర్‌జేసీ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న శైలజ సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించడంపై కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించారు.

నేడు వృత్తిశిక్షణ పొందిన మహిళలకు రాత పరీక్షలు

రెబ్బెన: సింగరేణి సేవా సమితి ద్వారా 2022 –23 ఆర్థిక సంవత్సరంలో వృత్తి శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మంగళవారం గోలేటిలోని సీఈఆర్ క్లబ్‌లో రాతపరీక్షలు నిర్వహిస్తున్నట్లు జీఎం రవిప్రసాద్ సోమవారం ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్‌లలో వృత్తి శిక్షణ కోర్సుల్లో గత సంవత్సరం 140 మంది శిక్షణ పూర్తి చేసుకోగా వారందరికి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోలేటిలోని సీఈఆర్ క్లబ్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మాదారం టౌన్‌షిప్‌లోని కమ్యూనిటీ హాల్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దోమ తెరలు పంపిణీ


దోమ తెరలు అందజేస్తున్న డీఎస్పీ

కాగజ్‌నగర్‌టౌన్: ‘పోలీసులు మీ కోసం’ కార్యక్రమంలో భాగంగా సోమవారం కాగజ్‌నగర్ పట్టణం కాపువాడలో గల కేజీబీవీ విద్యాలయం, కళాశాలలో కాగజ్‌నగర్ సీఐ బుద్దే స్వామి ఆధ్వర్యంలో విద్యార్థులకు దోమ తెరలు పంపిణీ చేశారు. వర్షాకాలంలో విద్యార్థినులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విద్యార్థులకు డెంగీ, మలేరియా వ్యాధుల నుంచి రక్షణ కోసం దోమ తెరలు అందజేశారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ కిరణ్ కుమార్, శ్రీలత, పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ నిర్వహించాలని రాస్తారోకో


రాస్తారోకోలో ఎస్ఎస్‌యూఐ నాయకులు

ఆసిఫాబాద్: 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఆసిఫ్ అలీ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్‌చౌక్ సమీపంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ఆందోళనను విరమింపజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్, ఎస్ఎస్‌యూఐ నాయకులు శ్యాం నాయక్, శేషారావు రాథోడ్, చరణ్, దీపక్, ఎండీ జమీర్, తిరుపతి, శేకు, ఉపేందర్, నితిన్, ప్రదీప్, తనికల్, రవికిరణ్, జీవంకర్, హరీశ్, జీవన్, శ్రీనివాస్, కృపాకర్, శంకర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం

ఆసిఫాబాద్‌అర్బన్: నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ హెచ్చరించారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె సోమవారం 5వ రోజుకు చేరింది. సంఘం జిల్లా అధ్యక్షుడు దివాకర్, నాయకులు చిరంజీవి, మధుకర్, సదాలక్ష్మి, సదానందం, సాయి, వెంకటేష్, శ్రీదేవి, సౌందర్య, సులోచన, చామంతి, జ్ఞానేశ్వరి, మాయ, లక్ష్మి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

‘బీసీల సింహగర్జన విజయవంతం చేయండి’

ఆసిఫాబాద్‌అర్బన్: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో ఈనెల 10వ తేదీన నిర్వహించే బీసీల సింహ గర్జన సభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నార్ రమేశ్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద సంఘం ఆధ్వర్యంలో నాయకులు సింహగర్జనకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్, మాలి సంఘం నాగోసె శంకర్, రైతు సంఘం అధ్యక్షుడు మారుతి పటేల్, నాయకులు ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

పార్థివ లింగపూజ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని వాసవీ మందిరంలో శ్రావణ సోమవారం పర్వదినం పురస్కరించుకొని రాత్రి ఆలయంలో ప్రదోశకాల పార్థివ లింగ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు రాజశేఖర శర్మ, చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో మహిళలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని బాలేశ్వర ఆలయంతో పాటు శివాలయాలు భక్తులతో సందడిగా మారాయి.

పండ్ల తోటలతో ఆర్థికాభివృద్ధి

జైనూర్: పండ్ల తోటల పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఏపీవో నగేశ్ అన్నారు. సోమవారం జామిని గ్రామంలో దత్తాత్రి అనే రైతు సాగు చేస్తున్న పండ్ల తోటను అధికారులతో కలిసి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ నీటి వసతి ఉన్న రైతులు పండ్ల తోటలు పెంచాలని, ఉపాధిహామీ నుంచి నిధులు కూడా మంజూరు చేస్తామన్నారు. సాంకేతిక సహాయకులు రాజలింగు, లింగేశ్, క్షేత్ర సహాయకుడు బాబు తదితరులు ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా:
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.సాయికుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899